ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
3
విజయనగరం
జిల్లా వార్తలు
సోమవారం 27 జనవరి 2025





అంబరాన.. గణతంత్ర సంబరం

↑ దేశ నాయకుల వేషధారణలో రిపబ్లిక్ డే వేడుకలకు హాజరవుతున్న చిన్నారులు

వార్తలు.. ఫొటోలు 4,5,6 పేజీల్లో

- పోలీస్ పరేడ్ గ్రౌండులో ఉత్సాహంగా గణతంత్ర వేడుకలు
- ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు, శకటాలు
- అబ్బురపరిచిన సాహసాలు
- హాజరైన మంత్రి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యే అదితి
- జెండాను ఆవిష్కరించిన కలెక్టర్

గణతంత్ర దినోత్సవాన్ని జిల్లా ప్రజలు స్ఫూర్తిమంతంగా జరుపుకున్నారు. జాతీయ నాయకుల వీరోచిత పోరాటం, త్యాగాల ఫలంగా చేకూరిన స్వాతంత్ర్య ఫలాలను అధికారికంగా అమలు చేసుకున్న రోజుగా మరో సారి గుర్తుచేసుకున్నారు. దేశ ప్రజలకు స్వేచ్ఛా వాయువులు ప్రసాదించిన నాయకులను స్మరించుకున్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఈ వేడుకలు ఆదివారం ఆద్యంతం ఉత్సాహంగా సాగాయి. విద్యార్థుల నృత్యాలు, సాహస ప్రదర్శనలు అబ్బుర పరిచాయి. అగ్నిమాపక శాఖ సిబ్బంది జెండా రంగుల్లో నీళ్లను స్ప్రే చేయడం కొత్తగా అనిపించింది. జాతీయ నాయకుల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. వివిధ శాఖల అభివృద్ధిని చాటుతూ రూపొందించిన శకటాలు ఆలోచింపజేశాయి. వాటిలో విద్యాశాఖ, ఐసీడీఎస్, వైద్యఆరోగ్య శాఖల శకటాలకు ప్రథమ బహుమతి లభించింది. కార్యక్రమానికి ముందు కలెక్టర్ అంబేడ్కర్ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. శాంతి కపోతాలను ఎగురవేశారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించాక జిల్లా ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూపొందించిన 2047 విజన్‌తో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. స్వర్ణ విజయనగరంగా రూపొందించడమే ఆశయంగా ప్రకటించారు. గణతంత్ర వేడుకల్లో జిల్లా న్యాయాధికారి కళ్యాణ చక్రవర్తి, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎస్పీ వకుల్‌జిందాల్, జేసీ సేతుమాధవన్ తదితరులు పాల్గొన్నారు.



బిందెలపై నృత్యం ప్రదర్శిస్తున్న విద్యార్థినులు →



శాంతి కపోతాలు ఎగురవేస్తున్న మంత్రి, కలెక్టర్ ←





విద్యార్థుల విన్యాసాలు

త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ అంబేడ్కర్, పక్కన ఎస్పీ వకుల్‌జిందాల్, జేసీ సేతుమాధవన్






గౌరవ వందనం సమర్పిస్తున్న పోలీసులు



అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..



మౌలిక సౌకర్యాలకు నోచక.. కనీస వసతులు కానరాక ప్రజలు అనేక ఇబ్బందులతో సతమతం కావడం చూస్తున్నాం. సమస్యలు, అవస్థలతో ఏళ్లుగా సహవాసం చేస్తుండడం గమనిస్తూనే ఉన్నాం. అధికారులకు, నేతలకు విన్నపాలు ఇచ్చి.. వారి చుట్టూ తిరిగి విసిగి వేసారిపోయే వారెందరో. తాగునీటి కుళాయి కావాలని అడిగి అడిగి అలసిపోయి ఇక తన పాట్లు ఏవో తాను పడతానని నిర్ణయించుకుని నిస్పృహలో బతుకుతున్న వారు కోకొల్లలు. అలాంటి వారి ఆవేదనను తీర్చాలని.. సగటు పౌరులకు ప్రభుత్వం నుంచి కనీస సేవలు అందాలని.. మౌలిక సౌకర్యాలు సమకూరాలని "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్" ఆకాంక్షిస్తోంది. అందులో భాగంగా వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. "అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా" పేరుతో ప్రజా సమస్యలను గుర్తించడంతో పాటు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలని నిర్ణయించింది.

-విజయనగరం, ఆంధ్రజ్యోతి

నేటి నుంచి శంబరం

- తొలేళ్లకు ఏర్పాట్లు పూర్తి
- మొదలైన సందడి
- రేపు సిరిమానోత్సవం

సాలూరు/ సాలూరు రూరల్/మక్కువ, జనవరి 26(ఆంధ్రజ్యోతి): శంబరలో సందడి మొదలైంది. ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోర్కెలు తీర్చే కల్పవల్లి శంబర పోలమాంబ జాతరలో తొలి అంకమైన తొలేళ్ల ఉత్సవానికి సర్వం సిద్ధమైంది. సోమవారం సంప్రదాయబద్ధంగా ఈ వేడుకను నిర్వహించనున్నారు. ఈ నెల 28న మంగళవారం సిరిమానోత్సవం, 29న బుధవారం అంపకోత్సవం జరగనుంది. పోలమాంబ జాతరకు ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలిరానున్నారు. అయితే ఎవరికీ ఎటువంటి ఇబ్బంది కలగకుండా, అమ్మవారి దర్శనం త్వరగా అయ్యేలా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఆలయ పరిసరాల్లో క్యూలైన్లు, మరుగుదొడ్లు తదితర వాటిని సిద్ధం చేశారు. ఇదిలా ఉండగా సాలూరు మండలం కందులపథం పొలిమేర వద్ద గుర్తించిన సిరిమాను ఏరువాక ద్వారా గ్రామంలోకి తీసుకొచ్చారు. దానిని సిరిమానుగా సోమవారం తయారు చేయనున్నారు. ఎస్పీ మాధవరెడ్డి ఆధ్వర్యంలో జాతరలో ప్రత్యేకంగా బాడీవేర్ కెమెరాలతో పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. సిరిమానోత్సవం రోజున ఆరు డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షించనున్నారు. ముగ్గురు డీఎస్పీలు, 14 మంది సీఐలు, 48 మంది ఎస్ఐలు, మరో నలుగురు మహిళా ఎస్ఐలు, 116 మంది ఏఎస్ఐలు,హెచ్‌సీలు, 282 మంది కానిస్టేబుళ్లు, మరో 56 మంది మహిళా కానిస్టేబుళ్లు, 138 మంది హోంగార్డులతో భారీ బందోబస్తు నిర్వహించనున్నారు.



40 వేల లడ్డూలు సిద్ధం

జాతరకు వచ్చే భక్తుల కోసం 40 వేల లడ్డూ ప్రసాదం సిద్ధం చేసినట్టు ఈవో వీవీ సూర్యనారాయణ ఆదివారం తెలిపారు. ఎవరికీ ఎటువంటి ఇబ్బందుల్లేకుండా జాతర ఏర్పాట్లు పూర్తి చేసినట్టు చెప్పారు. పది వారాల పాటు జాతర నిర్వహించను న్నామన్నారు.

సిద్ధమైన లడ్డూలు



బారికేడ్ల ఏర్పాట్లు పూర్తి




హాస్టళ్లలో డిజిటల్ బోధన

- నాలుగు బీసీ వసతిగృహాల్లో తొలుత ప్రారంభం
- రూ.4.30 లక్షలు కేటాయించిన ప్రభుత్వం
- త్వరలో విస్తరించే యోచన



వసతిగృహంలో డిజిటల్ తరగతి గదిని పరిశీలిస్తున్న సంక్షేమాధికారి పెంటోజీరావు(ఫైల్)



రాజాం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): వసతిగృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులపై కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. విద్యాబోధన, వసతిగృహాల్లో మెరుగైన వసతులు అందించాలని నిర్ణయించింది. అందులో భాగంగా ముందుగా బీసీ వసతిగృహాల్లో డిజిటల్ బోధన చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. జిల్లాలో ప్రయోగాత్మకంగా నాలుగు వసతిగృహాల్లో తొలుత డిజిటల్ విద్యాబోధన చేయనున్నారు. ఈ ప్రయోగం విజయవంతమైతే జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని వసతిగృహాల్లోనూ ప్రవేశపెట్టనున్నారు. 9,10 తరగతి విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యం ఉండాలన్న భావనతోనే ఈ నిర్ణయం తీసుకుంది. ఈ రెండు తరగతుల వారికి ప్రత్యేక డిజిటల్ గదులను ఏర్పాటుచేస్తారు. అందులో కంప్యూటర్‌తో పాటు భారీ ఎల్ఈడీ స్క్రీన్లు అమర్చుతారు.

జిల్లాలో 51 బీసీ వసతిగృహాలు ఉన్నాయి. అందులో 4,350 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ డిజిటల్ బోధన అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ముందుగా విజయనగరం, బొబ్బిలి, కొత్తవలస, గజపతినగరం వసతిగృహాలను ఎంపిక చేశారు. ఎస్ఆర్ శంకరన్ డిజిటల్ రిసోర్స్ కేంద్రాల పేరుతో డిజిటల్ తరగతులు నిర్వహించనున్నారు. నాలుగు వసతిగృహాల్లో రూ.4.30 లక్షలతో భారీ ఎల్ఈడీ స్క్రీన్లతో పాటు ఇతర పరికరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ బోధనకు సంబంధించి ట్యూటర్లను సైతం నియమించనున్నారు. మిగతా 47 వసతిగృహాల్లో సైతం తర్వాత రోజుల్లో డిజిటల్ బోధన కొనసాగనుంది.

నాలుగు వస్తువులతో కిట్లు

మరోవైపు ఎస్సీ వసతిగృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు సైతం ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ప్రత్యేక కిట్లు అందించనుంది. మార్చిలో పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. 30 ఎస్సీ వసతిగృహాల్లో రెండు వేల మందికిపైగా విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. వారందరికీ పెన్నులు, పెన్సిళ్లు, అట్టలు, ఆల్‌ఇన్ వన్‌తో కూడిన కిట్‌ను అందించనున్నారు. ఇందుకు సంబంధించి జిల్లాకు రూ.2.34 లక్షలు విడుదలైంది. త్వరలో విద్యార్థులందరికీ కిట్ల పంపిణీకి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. పదో తరగతి పరీక్షలు ప్రారంభానికి ముందే కిట్ల పంపిణీ పూర్తిచేస్తామని ఎస్సీ సంక్షేమ సాధికారిత అధికారి రామానందం తెలిపారు.

ఐదేళ్లు కొనసాగిన నిర్లక్ష్యం

గత ఐదేళ్లలో ఎస్సీ, బీసీ వసతిగృహాలపై వైసీపీ సర్కారు శీతకన్ను వేసింది. కనీసం పట్టించుకున్న పాపాన పోలేదు. నిర్వహణను గాలికొదిలేసింది. కాస్మెటిక్ చార్జీలు సైతం చెల్లించలేదు. ఎప్పుడో 2018 నాటి ధరలతో మెనూ అమలుచేయడంతో ఆ ప్రభావం ఆహార పదార్థాల నాణ్యతపై పడింది. వార్డెన్లకు సరిగా బిల్లులు చెల్లించక వారు పూర్తిస్థాయిలో పట్టించుకోలేదు. దీంతో వసతిగృహాల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్కో సమస్య పరిష్కరిస్తూ ముందుకు సాగుతోంది. గత ప్రభుత్వం నిలిపివేసిన చెల్లింపులు, వసతిగృహాల్లో మౌలిక వసతులు వంటి వాటిపై దృష్టిపెట్టింది.

నాలుగు హాస్టళ్లలో డిజిటల్ బోధన

జిల్లాలో నాలుగు వసతిగృహాల్లో డిజిటల్ విద్యాబోధన ప్రారంభం అవుతోంది. వాటిలో ప్రయోగాత్మకంగా చేపట్టాం. మిగతా వసతిగృహా లకు సైతం విస్తరిస్తాం. ఈ నాలుగు వసతిగృహాలకే ప్రభుత్వం రూ.4.30 లక్షలు కేటాయించింది. డిజిటల్ విద్యాబోధనను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

- పెంటోజీరావు, బీసీ సంక్షేమ సాధికారిత అధికారి





కలెక్టర్ అంబేడ్కర్‌కు సెల్యూట్ చేస్తున్న పోలీసు జాగిలం





గణతంత్ర సంబరాలు



గణతంత్ర దినోత్సవాలను చిత్రీకరిస్తున్న డ్రోన్ కెమెరా

● విజయనగరంలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు ● ఆకట్టుకున్న ప్రభుత్వ శాఖల శకటాలు





పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్‌జిందాల్,



వేడుకలను తిలకిస్తున్న జిల్లా న్యాయాధికారి కల్యాణ చక్రవర్తి, మంత్రి శ్రీనివాస్



విద్యాశాఖ శకటం (ప్రథమ బహుమతి)



వైద్య ఆరోగ్యశాఖ శకటం (ప్రథమ బహుమతి)



ఐసీడీఎస్ శకటం (ప్రథమ బహుమతి)



విద్యుత్ శాఖ శకటం (ద్వితీయ బహుమతి)



ఉద్యానవన శాఖ శకటం (తృతీయ బహుమతి)



మత్స్యశాఖ స్టాల్‌లో చేపలను పరిశీలిస్తున్న అధికారులు

విజయనగరం కలెక్టరేట్/ దాసన్నపేట/ రింగురోడ్డు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకల్లో భాగంగా స్థానిక పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు దేశభక్తి గీతాలను ఆలపిస్తూ.. నృత్యాలతో అలరించారు. నెల్లిమర్ల మండలం కొండవెలగాడ పాఠశాల విద్యార్థులు 'భరత ఖండమే నా దేశం' అనే గీతాన్ని ఆలపిస్తూ నృత్యం చేశారు. విజయనగరం కేజీబీవీ చిన్నారులు 'నమో నమో కేథారనాథ్ బోల్‌నాథ శంకర్' అనే గీతాన్ని ఆలపించారు. నెల్లిమర్ల మహాత్మగాంధీ జ్యోతిరావు పూలే విద్యార్థులు 'జగతి సిగలో జాబిలమ్మ' అంటూ నృత్యం చేశారు. చీపురుపల్లి, రాజాం బాలభవన్ విద్యార్థులు వందేమాతరం గీతాన్ని ఆలపించారు. వేపాడ, కొత్తవలస, నెల్లిమర్ల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు నృత్యం చేశారు. కొత్తవలస జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు థింసా నృత్యాన్ని ప్రదర్శించారు.

శకటాల ప్రదర్శన..

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలకు సంబంధించి శకటాల ప్రదర్శనను స్థానిక పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేశారు. డీఆర్‌డీఏ (జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ), గృహ నిర్మాణం, పరిశ్రమలు, పర్యాటకం, విద్యా శాఖ, వైద్యం, శిశు సంక్షేమ శాఖ, క్రీడలు, కాలుష్య నియంత్రణ మండలి, జలవనరులు, గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం, వ్యవసాయం, మత్స్య, డ్వామా, విద్యుత్, ఉద్యానవన శాఖలతో పాటు సెంచూరియన్ విశ్వవిద్యాలయం హెల్త్ కేర్‌పై శకటాలను ప్రదర్శించాయి. ఇవి అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. వీటికి బహుమతులు అందించారు.





అగ్ని ప్రమాద సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అగ్నిమాపక సిబ్బంది ప్రయోగం

అభివృద్ధి, సంక్షేమమే.. లక్ష్యం

● కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్
● పార్వతీపురంలో ఘనంగా గణతంత్ర వేడుకలు



పోలీసు జాగిలం విన్యాసం

పార్వతీపురం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఆదివారం పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఘనంగా గణతంత్ర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరణ తర్వాత ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సహకారంతో ఎన్నో అంశాల్లో ప్రగతి సాధించామన్నారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందజేశామన్నారు. అన్ని వర్గాలకూ సముచిత స్థానం కల్పించామని వివరించారు. బలహీన వర్గాలు, మహిళలకు అండగా నిలిచినట్లు చెప్పారు. జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి కార్య క్రమాలు, అమలవుతున్న సంక్షేమ పథకాల ప్రగతిని తెలియజేశారు. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న 487 మంది అధికారులు, సిబ్బందికి కలెక్టర్ పురస్కారాలు అందించారు.

ప్రత్యేక ఆకర్షణగా డాగ్‌షో...

రిపబ్లిక్ డే వేడుకల్లో డాగ్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బిందు, లైకా, శాండీ పేరు గల పోలీస్ జాగిలాల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ముందుగా బిందు, లైకాలు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎస్పీ మాధవరెడ్డిలకు పుష్పగుచ్ఛాలను అందజేసి సెల్యూట్ చేశాయి.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

పార్వతీపురం టౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో పార్వతీపురం పాఠశాల విద్యార్థినులు శాస్త్రీయ నృత్యంతో ఆకట్టుకున్నారు. సీతంపేట ఐటీడీఏ పరిధి బడ్డ మానింగి ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థినులు 'రింగ్ రింగ్ నరేన' గీతానికి నృత్యం చేశారు.



జీఎల్‌పురం కేజీబీవీ విద్యార్థినుల పిరమిడ్ విన్యాసం



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

జయహో అంటూ సాలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు తమ నృత్యంతో ఆలోచింపజేశారు. భామిని కేజీబీవీ విద్యార్థులు ప్రదర్శించిన థింసా నృత్యం అలరించింది. గుమ్మలక్ష్మీపురం కేజీబీవీ విద్యార్థినులు పిరమిడ్ విన్యాసాలతో అబ్బురపరిచారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ, ఏఎస్పీ దిలీప్ కిరణ్, జేసీ శోభిక తదితరులు వారిని అభినందించి బహుమతులు అందజేశారు.

శకటాల ప్రదర్శన

జిల్లాలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, యంత్రాంగం సాధించిన ప్రగతి అంశాలను తెలుపుతూ సాగిన శకటాల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. పాఠశాల విద్యాశాఖ ఏర్పాటు చేసిన శకటం ప్రథమ స్థానంలో నిలిచింది. పంచాయతీ రాజ్, జల వనరులు, ఆర్అండ్‌బీ, గ్రామీణ నీటి సరఫరా విభాగాల శకటం ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది. విద్యుత్ శాఖ శకటం తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. సంబంధిత అధికారులకు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాత్సవ, డీఆర్వో హేమలత, కేఆర్‌సీ ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు వై.సత్యంనాయుడు, రామచంద్రరావు, డీఐపీఆర్‌వో ఎల్.రమేష్, జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి టి.కనకదుర్గ, వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్, డీఎంహెచ్‌వో భాస్కరరావు, డీఈవో తిరుపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.



ద్వితీయ స్థానం సాధించిన పీఆర్, జలవనరుల శాఖ శకటం



తృతీయ స్థానంలో నిలిచిన విద్యుత్ శాఖ శకటం

● అధికారులకు అవార్డులు అందజేసిన కలెక్టర్ అంబేద్కర్

ఉత్తమ సేవకులకు గుర్తింపు

విజయనగరం కలెక్టరేట్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఉత్తమ సేవలు అందించిన అధికారులు, వివిధ స్వచ్ఛంద సంస్థలకు గణతంత్ర వేడుకల్లో భాగంగా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో కలెక్టర్ అంబేద్కర్ ప్రశంసా పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేసీ సేతుమాధవన్, ఎస్పీ వకుల్ జిందాల్, డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో కీర్తి తదితరులున్నారు.



ప్రమీలాగాంధీ డిప్యూటీ కలెక్టర్ | జోషఫ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ | సత్యవాణి ఆర్డీవో, చీపురుపల్లి | రామ్మోహనరావు ఆర్డీవో, బొబ్బిలి | కీర్తి ఆర్డీవో, విజయనగరం | సౌమ్యలత ఏఎస్పీ | శ్రీనివాసమూర్తి డీఆర్వో



జేసీ సేతు మాధవన్‌కు అవార్డును అందజేస్తున్న కలెక్టర్, ఎస్పీ



సుధారాణి, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ | రామారావు జేడీ, వ్యవసాయశాఖ | వై.వి.రమణ జేడీ, పశు సంవర్ధకశాఖ | ఎం.లక్ష్మణరావు, ఎస్ఈ, ఏపీఈపీడీసీఎల్ | మధుసూధనరావు డీఎస్‌వో | మీనాకుమారి, డీఎం సివిల్ సప్లయిస్ | కల్యాణచక్రవర్తి, పీడీ డీఆర్‌డీఏ | రమేశ్ డీపీఆర్వో | వెంకటేశ్వరరావు డీఎస్‌డీవో | రామ్‌ప్రకాశ్ జిల్లా అగ్నిమాపక సేవాధికారి | వీవీఆర్ మూర్తి ఎల్‌డీఎం



రవికిరణ్, ఏడీ మార్కెటింగ్‌శాఖ | పి.నల్లనయ్య మున్సిపల్ కమిషనర్ | రామలక్ష్మి కమిషనర్, బొబ్బిలి | రామప్పలనాయుడు కమిషనర్, రాజాం | ఆర్ఎస్ జాన్ ఈడీ, మైనార్టీ ఫైనాన్స్ | శ్రీనివాస్, ఎస్ఈ పంచాయతీరాజ్ | బాలాజీ సీపీవో | కాంతిమతి ఎస్ఈ, ఆర్అండ్‌బీ | రామానందం డీడీ, సోషల్ వెల్ఫేర్ | మణికుమార్ ఉప రవాణా కమిషనర్ | సత్యనారాయణ సీఈవో, జడ్పీ

● అధికారులకు ప్రశంసాపత్రాలు, అవార్డుల అందజేసిన శ్యామ్‌ప్రసాద్

ఉత్తమ ఉద్యోగులకు అవార్డులు

పార్వతీపురం: వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన సేవకులకు, అధికారులకు సిబ్బందికి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ ప్రతిభా పురస్కారాలను అందించారు. జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న 487 మంది అధికారులు, సిబ్బందికి కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపి ప్రతిభా పురస్కారాలు అందించారు.



డా.వాగ్దేవి డీసీహెచ్ఎస్ | రామచంద్రరావు, డ్వామా పీడీ | శ్రీనివాసరావు, సివిల్ సప్లయ్ మేనేజర్ | దిలీప్ కిరణ్, ఏఎస్పీ | రాబర్ట్ పాల్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి | హేమలత, డీఆర్వో | అశుతోష్ శ్రీవాస్తవ సబ్ కలెక్టర్



కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న జేసీ శోభిక



పి.వీర్రాజు డీపీవో | ఎన్.తిరుపతిరావు డీఈవో | ఎం.శశికుమార్, జిల్లా ప్రజా రవాణా అధికారి | రాంగోపాల్, సెట్‌విజ్ సీఈవో | జి.శ్రీరామమూర్తి, సూపరింటెండెంట్ | బి.శివజగన్మోహన్, సీసీ, సీడీఎం పేషీ | చిట్టెమ్మ సీసీ టు జేసీ | ఎ.దుర్గా ప్రసాద్ రావు, ఏవో | మహేంద్ర కుమార్, జీజీసీ మేనేజర్ | విజయ్‌మోహన్, వైద్యాధికారి, పీపీ యూనిట్ | పల్లా శ్రీధర్, వైద్యాధికారి, మాదలంగి పీహెచ్‌సీ



మనోజ్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ | వి.చిట్టిబాబు, జీఎస్‌డబ్ల్యూఎస్ డీసీవో | ఎం.వాసుదేవరావు నాయుడు, పీడీ, దోకిశీల | బి.చక్రధర్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ | ఎన్.గౌరీశ్వరి, డీపీఆర్వో సబార్డినేట్ | జి.అనిల్ కుమార్, కలెక్టరేట్ సబార్డినేట్ | ఎస్.నారాయణరావు, సీఈవో, పీఏసీఎస్ | శ్రీను, ఎస్పీ కార్యాలయ పీఆర్వో | పి.రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, పార్వతీపురం | లావణ్య, పీసీ, దిశ పోలీస్‌స్టేషన్ | ఎం.మల్లిబాబు, పీసీ, పార్వతీపురంటౌన్ | ఎన్.ఝాన్సీరాణి, లాబ్ టెక్నీషియన్

పార్వతీపురం ఐటీడీఏలో..

పార్వతీపురంజనవరి 26(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం పార్వతీపురం ఐటీడీఏలో ఉత్తమ సేవలు అందజేసిన అధికారులకు పీవో అశుతోష్ శ్రీవాస్తవ అవార్డులతో పాటు ప్రశాంసా పత్రాలు అందజేశారు.



గోపి, దఫే దారుడు | వి.శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ | పద్మజ, సీనియర్ అసిస్టెంట్ | జి.గౌరీశంకర్రావు , జూనియర్ అసిస్టెంట్



ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న డిప్యూటీ డీఈవో మోహన్‌రాయుడు

సీతంపేట ఐటీడీఏలో..

సీతంపేట రూరల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ కేంద్రంగా నిర్వహించిన 76వ గణతంత్ర దినోత్సవంలో ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి 450మంది ఉద్యోగులకు అవార్డులతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు.



భానుప్రతాప్, దోనుబాయి పీహెచ్‌సీ వైద్యాధికారి | నారాయుడు, సీనియర్ హెచ్ఎం | సతీష్, డీపీవో | అన్నదొర, డీడీ



ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఏపీవో చిన్నబాబు

టీడీపీ నేత టెంకాల మృతి

రేగిడి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో చిన్నశిర్లాం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు టెంకాల గోవిందరావు(78) మృతిచెందారు. ఆయన మృతికి దూబ ధర్మారవు, కిమిడి అశోక్‌కుమార్, టెంకాల అచ్చం నాయుడు, పాలవలస రామచంద్రినాయుడు సంతాపం తెలిపారు.

బాలకృష్ణకు పద్మభూషణ్‌పై హర్షం

లక్కవరపుకోట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): నందమూరి బాలకృష్ణకు కేంద్రప్రభుత్వం పద్మవిభూషణ్ అవార్డు ప్రకటించడంపై ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి హర్షం వ్యక్తం చేశారు. ఎల్.కోటలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ బాలకృష్ణ చేసిన సేవలను ప్రభుత్వం గుర్తించిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబీఏ రాంప్రసాద్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కరెడ్ల ఈశ్వరరావు, మాజీ ఎంపీపీ కొల్లు రమణమూర్తి, మల్లునాయుడు, చంద్రశేఖర్, రాముడు పాల్గొన్నారు.

● రాజాం: పద్మభూషణ్ అవార్డుకు ఎంపికైన నందమూరి బాలకృష్ణకు టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యుడు, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి మరెన్నో పురస్కారాలు అందుకోవాలని కోరారు.

పాఠశాలకు ఆర్వో ప్లాంట్

రాజాం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గయ్యన్నవలస ప్రాథమిక పాఠశాలకు విజయనగరం ఐడీబీఐ బ్యాంకు సిబ్బంది రూ.35వేలు విలువైనఆర్వో ప్లాంట్, రెండు బీరువాలు, ర్యాక్‌ను స్కూల్ కమిటీ ఛైర్మన్ వాజా భాస్కరరావు, సర్పంచ్ సమతం లక్ష్మి చేతుల మీదుగా ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ఐడీబీఐ ఏజీఎంఆర్ ఉమాకాంత్, అసిస్టెంట్ మేనేజరు వజ్జిపత్తి కిశోర్,సమతం రమేష్, పడాల సత్యారావు, లక్ష్మణరావు, సురేష్, చిరంజీవి పాల్గొన్నారు.

అదనంగా దుకాణాలు కేటాయించండి

గజపతినగరం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కల్లుగీతకార్మికులకు ప్రభుత్వం పదిశాతం మద్యం దుకాణాలు కేటాయించడం శుభపరిణామమైనా, అదనంగా దుకాణాలను కేటాయించేందుకు ప్రభుత్వం ఆలోచించాలని ఆ సంఘ జిల్లా గౌరవ అధ్యక్షుడు పురం అప్పారావు కోరారు. ఆదివారం గజపతినగరంలో విలేకరులతో మాట్లాడుతూ నిబంధనల మేరకు జిల్లాకు 15 మద్యం దుకాణాలను కేటాయించారని, అయితే మండలానికి ఒక దుకాణం ఇచ్చేలా ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు.

యువతి అదృశ్యం

భోగాపురం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): మండలం రెడ్డికంచేరు గ్రామానికి చెందిన యువతి పెంటమాని పద్మ అదృశ్యమైనట్లు ఆమె తండ్రి పెంటమాని పైడయ్య శనివారం రాత్రి ఫజర్యాదు చేశారని ఎస్ఐ వి.పాపారావు ఆదివారం తెలిపారు. పద్మ హైదరాబాద్‌లో పనినిమిత్తం వెళ్లి ఇటీవల ఇంటికి వచ్చిందన్నారు. రెండు రోజులుగా ఆమె కనిపించడం లేదని తెలిపారన్నారు.

ఘనంగా గణతంత్ర దినోత్సవం

విజయనగరం కలెక్టరేట్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకల్లో భాగంగా ఆదివారం స్థానిక కలెక్టరేట్ వద్ద జాతీయ పతాకాన్ని జేసీ సేతు మాధవన్ ఆవిష్కరించారు. హాజరైన ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో శ్రీనివాసమూర్తి, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

●విజయనగరం క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్పీ వకుల్ జిందాల్ ముఖ్య అతిథిగా హాజరై జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు సౌమ్యలత, నాగేశ్వరరావు, డీఎస్పీలు యూనివర్స్, వీరకుమార్, ఎం శ్రీనివాసరావు, రాఘవులు, కార్యాలయ ఏవో శ్రీనివాసరావు, సీఐలు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

● జేఎన్‌టీయూలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో వీసీ డి.రాజ్యలక్ష్మి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.



ఏఆర్ కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎస్పీ

ఉద్యోగులకు అవార్డులు



అవార్డు స్వీకరిస్తున్న ఎస్ఆర్వో రమేష్, ఎస్ఏ బంగారురాజు

విజయనగరం దాసన్నపేట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో ఆదివారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగులకు అవార్డులు అందజేశారు. కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబెద్కర్ చేతులమీదుగా విజయనగరం ఆర్‌వో కార్యాలయం సబ్ రిజిస్ట్రార్ టి.రమేష్, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ సహాయకుడు సీమునురు బంగారురాజులు ఉత్తమ ఉద్యోగులుగా అవార్డు అందుకున్నారు. అలాగే డీఐజీ కార్యాలయంలో సీనియర్ సహాయకులుగా విధులు నిర్వహిస్తున్న ఉమా కళ్యాణి అవార్డు స్వీకరించారు. ఈ సందర్భంగా స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ విజయలక్ష్మి, జిల్లా రిజిస్ట్రార్ ఏవీ కుమారిలు, సబ్ రిజిస్ట్రార్లు, ఉద్యోగులు వారికి అభినందనలు తెలిపారు.

మోసగాళ్లను శిక్షించండి: మంత్రి

విజయనగరం క్రైం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ యోగా టీచర్ల ఉద్యోగాల పేరిట నిరుద్యోగులను మోసంచేసిన వారిని కఠినంగా శిక్షించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు యోగా టీచర్ల నియామకం పేరిట గత ప్రభుత్వ హయాం నిరుద్యోగ యువకులను బురిడీ కొట్టించిందని పేర్కొన్నారు. ఈ మేరకు బాధితులైన నిరుద్యోగులు మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను ఆయన నివాసంలో కలిసి, తమకు న్యాయం చేయాలని కోరారు. తక్షణమే స్పందించిన మంత్రి శ్రీనివాస్, విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టీ, ఎస్పీ వకుల్ జిందాల్‌తో ఫోన్లో మాట్లాడారు. దర్యాప్తు జరిపి బాధితులందరికీ న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

శృంగవరపుకోట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట పుణ్యగిరి రోడ్డులోని గిరిజన కళాశాల బాలుర వసతిగృహంలో తాగునీటిని సరఫరా, స్నానపు గదులను ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ సండి సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాజు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ నిరసన

విజయనగరం దాసన్నపేట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆదివారం నగరంలోని మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంతంలో విజయదుర్గా ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

చిరు వ్యాపారి ఆత్మహత్య

సంతకవిటి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి); మండలంలో బొద్దూరు గ్రామానికి చెందిన ఓ చిరు వ్యాపారి అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నారు. ఇందుకు సంబంధించి ఎస్ఐ ఆర్.గోపాలరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్న గెంబలి తవిటిరాజు (45)కు వ్యాపారంలో న టష్టం వాటిల్లింది. అప్పులు తీర్చలేక గురువారం మధ్యాహ్నం తమ ఇంటిలో ఉరి వేసుకున్నారు. కుటుంబ సభ్యులు గమనించి రాజాంలోని ఆసుపత్రి తరలించారన్నారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళంలోని రిమ్స్ తరించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారని ఎస్ఐ గోపాలరావు వెల్లడించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పురుగు మందు సేవించి మరొకరు..

గుర్ల, జనవరి 26(ఆంధ్రజ్యోతి):మండలంలోని కెల్ల గ్రామానికి చెందిన పంచాది శివ(30) పురుగు మందు సేవించి మృతిచెందినట్టు ఎస్ఐ నారాయణరావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం శివ మద్యానికి బానిస కావడంతో తన భార్య పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయిందన్నారు. దీంతో మనస్థాపం చెందిన ఈ నెల 18న పురుగుల మందు సేవించాడు. ఇది గమనించిన బంధువులు, భార్య స్థానిక సీహెచ్‌సీకి తరలించి అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం విజయనగరం మహరాజా ఆసుపత్రికి తరలించారు. కాగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్టు తెలిపారు.

అనారోగ్యంతో రెండునెలల శిశువు మృతి

శృంగవరపుకోట రూరల్ జనవరి 26 : మండలంలోని దారపర్తి పంచాయతీ చిలకపాడుకు చెందిన జన్ని విజయ్ (రెండు నెలల 15రోజులు) ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. ఈ విషయంపై బాలుడు కుటుంబసభ్యులు, గిరిజన యువత జరత గౌరిష్ మాట్లాడుతూ బాబుకు అనారోగ్యం చేస్తే విజయనగరం ఘోషా ఆసుపత్రికి గత ఆదివారం స్థానిక ఏఎన్ఎం సహకారంతో తీసుకెళ్లామన్నారు. అయితే వైద్యం తరువాత శనివారం ఇంటికి తీసుకోచ్చాక ఆదివారం సాయంత్రం మరణించాడని వాపోయారు. గతంలో తమ గిరిజన గ్రామాలకు హెల్త్ అసిస్టెంట్ తాతారావు వారంలో నాలుగురోజులు కొండపైకి వచ్చిన బాగోగులు చూసేవాడని, ఆయన ఉద్యోగం పోవడంతో ఆయన స్థానంలో ఎవ్వరు రాలేదని ఆరోపించారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

వేపాడ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొద్దాం గ్రామానికి చెందిన మహిళ అదృశ్యంపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు వల్లంపూడి ఎస్ఐ బొడ్డు దేవి తెలిపారు. బొద్దాం గ్రామానికి చెందిన కంచిపాటి వాణి (46) ఐదు అడుగులు ఎత్తు, తెల్లని ఛాయ, గుండ్రని ముఖం, గోధుమ రంగు చీర జాకెట్‌తో ఉన్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు.

వసతులు లేవు.. నిర్వహణ లేదు

● తాగునీరందక అవస్థలు ● శిథిలావస్థకు చేరిన మురుగు కాలువలు
● ఇదీ విజయనగరంలోని ఉడా కాలనీలో పరిస్థితి

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..


కాలనీలోని ట్రాన్స్‌ఫార్మర్ ఆవరణలో పేరుకుపోయిన చెత్త

విజయనగరం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి)/టౌన్

విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలోని కలెక్టరేట్‌కు సమీపంలోగల 48వ డివిజన్‌లో ఉన్న ఉడాకాలనీలో సమస్యలు పాగావేశాయి. మూడు దశాబ్దాల కిందట ఏర్పడిన కాలనీలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వసతులు లేకపోవడంతో ఇక్కడి వారికి అవస్థలు తప్పడం లేదు. దీనికితోడు కాలనీ నిర్వహణపై నగరపాలకసంస్థ యంత్రాంగం చోద్యంచూస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా తాగునీటికి అగచాట్లు తప్పడంలేదు. కాలువలు దెబ్బతినడంతో రోడ్లపైకి మురుగు నీరుచేరుతోంది.

ఇదీ పరిస్థితి..

1994లో ఏర్పాటుచేసిన ఉడాకాలనీ ఫేజ్-2లో ప్రస్తుతం 15 వందలకుపైగా నివాస సముదాయాలు ఉన్నాయి. కాలనీ ఏర్పాటుచేసిన సమయంలో నిర్మించిన మురుగునీటి కాలువలే నేటికి దర్శనమిస్తున్నాయి. దీంతోపాటు పలుచోట్ల కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా కాలువలు లేకపోవడంతో రోడ్లపైకి మురుగు చేరుతోంది. దీనికితోడు మూడు దశాబ్దాల కిందట నిర్మించిన కాలువలు కావడంతో కొన్ని చోట్ల శిథిలావస్థకు చేరాయి. దీంతో మురుగునీరు బయటకు వెళ్లకపోవడంతో దుర్గంధం వెలువడుతోంది.

కాలనీలోకి ఆసుపత్రి వ్యర్థాల నీరు

కాలనీకి ఆనుకుని కేంద్ర సర్వజన ప్రభుత్వ ఆసుపత్రి ఉంది. దీంతో ఆసుపత్రి నుంచి వచ్చే వ్యర్థ నీరు కాలనీ గుండా ప్రవహిస్తుండడంతో తీవ్ర దుర్గంధం వెలువడుతోందని స్థానికులు వాపోతున్నారు. ఆసుపత్రి నుంచి వ్యర్థ నీరు వచ్చే పైపులైన్ కాలనీ సమీపంలో తెరిచిఉంది. దీంతో ఒక్కోసారి ఆసుపత్రిలోని వ్యర్థాల వల్ల వ్యాధుల బారినపడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు.

క్లోరినేషన్ లేని నీటి సరఫరా..

కాలనీలో నీటి సరఫరాకు ట్యాంకు ఏర్పాటుచేశారు. అయితే ఏళ్ల తరబడి నీటి ట్యాంకు శుభ్రం చేయని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో క్లోరినేషన్ లేని నీటి సరఫరా చేస్తుండడంతో వాటినే తాగాల్సివస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు. దశాబ్దాల కిందట నిర్మించిన నీటి ట్యాంకు కావడంతో నిర్వహణ లోపం వల్ల మెట్లు పూర్తిగా విరిగిపోయాయి. దీంతో క్లోరినేషన్ చేయకపోవడంతోపాటు నీటి ట్యాంకును శుభ్రతకు నోచుకోవడంలేదు. ట్యాంకు నీరందించే రెండు బోరుబావుల్లో ఒకటి పాడయ్యింది. దీంతో ఉన్న ఒక్క బావితోనే నీటిని ఎక్కించి కాలనీ అంతటికీ సరఫరా చేస్తున్నారు. దీంతో పూర్తిస్థాయిలో నీరందక తాగునీరందడంలేదని పలువురు వాపోతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలు..

కాలనీలో ఏర్పాటుచేసిన పార్క్‌లో నిర్వహణకు నోచుకోకపోవడంతో అధ్వానంగా మారింది. పార్క్‌లో 16 విద్యుత్ స్తంభాలకుగాను ఒకే విద్యుత్ దీపం వెలుగుతోంది. దీంతో చీకటిపడితే పార్క్‌లోకి వచ్చేందుకు కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు. సేదతీరడానికి ఉపయోగించే బెంచీలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. పార్క్‌లో ఉన్న బోరుబావి కూడా పాడై నెలలు గడిచిపోయినా అధికారులు, ప్రజాప్రతినిధులు మరమ్మతులకు చర్యలు తీసుకోవడంలేదని సందర్శకులు వాపోతున్నారు. పార్క్ చుట్టూ ఉన్న రక్షణ గోడ, గేట్లు శిథిలావస్థకు చేరుకోవడంతో పశువులు, పందులు, కుక్కలకు ఆవాసంగా మారింది. విద్యుత్ దీపాలు లేకపోవడంతో ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు పార్క్‌ను వినియోగిస్తున్నారు. ప్రధానగేటు వద్ద చెత్తకుండి లేకపోవడంతో పార్క్‌లో అడుగడుగునా చెత్త పేరుకుపోయింది. దీంతో దుర్వాసన వెలువడుతోందని పలువురు చెబుతున్నారు.

చీకట్లోనే కాలక్షేపం..



కాలనీవాసులకు ఆహ్లాదాన్ని పంచే పార్క్‌లో సమస్యలు చూస్తుంటే బాధేస్తోంది. మావంటి పదవీ విరమణ పొందిన ఉద్యోగులు ఉదయం, సాయంత్రం సమయాల్లో ఇక్కడకు ఎక్కువగా వస్తున్నారు. పార్క్‌లోకి వచ్చి సేదదీరేందుకు వస్తే పశువుల పేడ, వ్యర్థాలతోపాటు, ఆకతాయిలు వదిలేసిన మందు బాటిళ్లు కనిపిస్తున్నాయి. పార్క్‌లో విద్యుత్ దీపాలు లేక పాముల భయంతో చీకట్లోనే కాలక్షేపం చేస్తున్నాం. ఉన్న ఒక్క బోరుబావి కూడా పాడైంది.

-కె.సత్యారావు, కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు

ఆసుపత్రి నీటితో అవస్థలు..



సరఫరా తక్కువగా ఉండడంతో నీరు చాలక ఇబ్బందులు పడుతున్నాం. నీటి ట్యాంకు బోరు బావి ఒకటి పాడైంది. నీటి ట్యాంకుకు ఉన్న మెట్లు విరిగిపోవడంతో ట్యాంకు శుభ్రం చేయడంలేదు. క్లోరినేషన్ లేకుండానే నీటి సరఫరా చేస్తున్నారు. ఆసుపత్రి నుంచి వ్యర్థపు నీటితో వచ్చే వాసనతో ఇబ్బందులు పడుతున్నాం.

-పిన్నింటి జనార్దనరావు, కార్యదర్శి


ఉడాకాలనీలో నిరుపయోగంగా ఉన్న బోరు

వీధి దీపాలు లేక..

మూడు దశాబ్దాల కిందట ఏర్పాటైన కాలనీలో సరిపడినన్ని విద్యుత్ స్తంభాలు లేవు. దీంతో వీధిదీపాలు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రుల్లో శివారున ఉన్న నివాసితులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికే వరుస దొంగతనాలతో కాలనీవాసులు బిక్కుబిక్కుమని గడుపుతున్నారు. వీధుల్లో సిమెంట్ రోడ్లు లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలకు ప్రహరీగోడ లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. కాలనీకి ఆనుకుని ఉన్న ప్రభుత్వ, మునిసిపల్ స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయి.


గోతులమయమైన రోడ్డు


జనావాసాల్లో మురుగు నీరు

అభివృద్ధే లక్ష్యం

● స్వర్ణ విజయనగరంగా రూపొందించడమే ఆశయం ● తలసరి ఆదాయం రెట్టింపు చేస్తాం ● గణతంత్ర దినోత్సవంలో కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రూపొందించిన వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూపొందించిన 2047 విజన్‌తో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ చెప్పారు. ప్రజల తలసరి ఆదాయం పెంచి వారి జీవన ప్రమాణాలు మరింత మెరుగుపరిచే దిశగా విజన్ డాక్యుమెంట్ రూపొందించామన్నారు. విజయనగరం పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం ప్రారంభమైన 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన తొలుత త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాలు, పారిశ్రామిక సేవా రంగాల్లో ఏటా 15 శాతం పైబడి వృద్ధి రేటు సాధిస్తూ 2047 నాటికి స్వర్ణ విజయ నగరం రూపొందించడమే లక్ష్యమన్నారు. జిల్లాలో ప్రస్తుతం వున్న 1.46 లక్షల తలసరి ఆదాయాన్ని ఐదేళ్లలో రెట్టింపు స్థాయి రూ.3.23 లక్షలకు వెళ్లాలన్నదే తమ లక్ష్యమన్నారు. ప్రాథమిక రంగమైన వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్థక, అటవీ, మత్స్య, పారిశ్రామిక రంగాల్లో 60.94 ఉన్న వృద్ధి రేటును ఐదేళ్ల నాటికి 12.23 శాతానికి తీసుకువెళ్లాలని నిర్ణయించుకున్నామన్నారు.

ధాన్యం కొనుగోలు

జిల్లాలోని 62,460 మంది రైతుల నుంచి 2.82 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేసి రూ.640 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. 45,400 హెక్టార్లలో ఉండే ఉద్యాన పంటలను 59,900 హెక్టార్లకు విస్తరిస్తున్నామన్నారు. బిందుసేద్యం, తుంపర్ల సేద్యం ద్వారా 30,050 హెక్టార్లకు ఈఏడాది సూక్ష్మ సాగునీటి పరికరాలు ఏర్పాటుచేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. మత్స్య రంగంలో కూడా రానున్న ఐదేళ్లల్లో సగటున 20 శాతం లక్ష్యం చేరుకునే దిశగా కృషి చేస్తున్నామన్నారు. పశువుల పరిరక్షణకు 1,987 గోశాలలను మంజూరు చేశామన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

● మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో వచ్చే ఐదేళ్లలో మరో 12 రైతు బజార్లను ఏర్పాటు చేయడం ద్వారా రైతుల మార్కెటింగ్ సౌకర్యాలను పెంచుతామన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి బ్యారేజీ ద్వారా ఈ ఏడాది 35,791 ఎకరాల్లో సాగునీరు అందించామని, తోటపల్లి కుడి ప్రధాన కాలువ పూడికతీత, కాలువ పునరుద్ధరణ కోసం రూ.4.71 కోట్లతో 13 పనులకు ఆమోదం లభించిందన్నారు. తారకరామ తీర్థసాగర్‌ద్వారా 49 గ్రామాల్లోని 24,710ఎకరాలకు సాగునీరందించేందుకు ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయన్నారు.

● పారిశ్రామిక వృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టామని, ప్రస్తుతం వున్న 8.68 వృద్ధి రేటును రానున్న ఐదేళ్లలో 17.67 తీసుకువెళ్లాలన్నది లక్ష్యమన్నారు.

● ఇసుక ఉచితంగా సరఫరా చేస్తున్నామని, ఇంతవరకూ 96,700 మెట్రిక్ టన్నులు వినియోగించుకున్నా మన్నారు. సూర్య ఘర్ పథకం ద్వారా ఇంటి పైకప్పులో సోలార్‌ప్యానల్ ఏర్పాటు చేసుకుని జీవితాంతం ఉచిత విద్యుత్ పొందవచ్చునని, దీనిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇప్పటి వరకూ జిల్లాలో 1.96 లక్షల కుళాయి కనెక్షన్లు ఇచ్చామని, ఈ మిషన్ కింద రూ.902 కోట్లతో 2,411 పనులు మంజూరు కాగా, 1,052 పనులు పూర్తయ్యాయన్నారు. గృహ నిర్మాణశాఖ ద్వారా జిల్లాలో మార్చి నాటికి 3,321 గృహాలను ప్రవేశాలకు సిద్ధం చేశామన్నారు. భోగా పురం అంతర్జాతీయ విమానాశ్రయంతో ఉత్తరాంధ్ర ముఖ చిత్రం మారనుందని, ఈ ఎయిర్‌పోర్టు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో కీలక భాగంగా మారనుందన్నారు.

●పర్యాటకాభివృద్ధికి పెద్దపీట వేశామని, తాటిపూడిలో బోటుషికారు పునఃప్రారంభించామన్నారు.జిల్లాలో 45 కోట్లతో 4 పర్యాటక ప్రాజెక్టులకు ప్రతిపాదనలు పంపామన్నారు.

● ఎన్టీఆర్ భరోసా పథకం కింద జిల్లాలో 2 లక్షల 75 వేల 379 మందికి ప్రతి నెల పింఛను పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితిగజపతిరాజు, జిల్లా న్యాయా ధికారి సాయి కళ్యాణ చక్రవర్తి, ఎస్పీ వకుల్ జిందాల్, జేసీ సేతుమాధవన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో దాట్ల కీర్తి తదితరులు పాల్గొన్నారు.

నాలుగు లైన్ల రోడ్డుకు డీపీఆర్: ఎంపీ కలిశెట్టి

రామభద్రపురం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): చిలకపాలెం జంక్షన్ నుంచి రాజాం, రామభద్రపురం మీదుగా కొమరాడ మండలంలోని రావాడ రామభద్రపురం వరకు నాలుగు లైన్ల రోడ్డు నిర్మించడానికి డీపీఆర్ సిద్ధమైనట్లు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. ఆదివారం రామభద్రపురం బైపాస్ రోడ్డు వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నో ఏళ్ల నుంచి ఈ రహదారి వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యను పరిష్కరించాలన్న ఉద్దేశ్యంతో కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కారితో చర్చించి హైవే నిర్మాణానికి నిధులు మంజూరుచేయాలని కోరామన్నారు. ఇప్పటికే దీనిపై కేంద్ర ప్రభుత్వం నుంచి హైవే అధికారులకు ఫీజిబులిటీ వచ్చిందని, వచ్చే ఏడాది బడ్జెట్‌లో నిధులు విడుదల కానున్నాయని తెలిపారు. విజయనగరం నుంచి నెలిమర్ల, పాలకొండ రోడ్డుతోపాటు రామతీర్థాల నుంచి రణస్థలం వరకు కొత్తరోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధంచేశామన్నారు. తన నియోజకవర్గం పరిధిలో సమస్యలను గుర్తించామని, ప్రాధాన్యతాపరంగా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో పరిశ్రమలు నెలకొల్పడానికి కృషి చేస్తానని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యలపై దృష్టిసారిస్తున్నారని తెలిపారు. పీహెచ్‌సీ పెన్షన్లు తొలగిస్తారని ప్రజల్లో అపోహఉందని, అయితే అనర్హులను మాత్రమే తొలగిస్తారని చెప్పారు. వైసీపీప్రభుత్వంలో ఇష్టా రాజ్యంగా పింఛన్లు మంజూరు చేశారని, అర్హులైన వారందరికి పెన్షన్లు ఉంటాయని తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు చింతల రామకృష్ణ, బెవర సీతారాం, తాడ్డి శ్రీనివాసరావు, రవ్వాఈశ్వరరావు, యోగినాయుడు పాల్గొన్నారు.